

యువత భవిష్యత్‌కు బాటలు : కోమటిరెడ్డి

యువత బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే కార్యక్రమాలకు ఇక్కడ శంకుస్థాపన చేసుకున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఇది గొప్ప కార్యక్రమం అన్నారు. ప్రపంచంలోనే మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం బాటలు వేసిందన్నారు. తమది చేతల ప్రభుత్వం అన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలిస్తామన్నారు. పది, పది హేనేళ్ల పాటు ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందన్నారు. ఏక కాలంలో రూ. 31కోట్ల రుణమాఫీ చేశామని, ఆగస్టు 15లోపు రుణమాఫీ పూర్తి చేస్తామని చెప్పారు.



సభకు హాజరైన జనం

అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

చిగురిస్తున్న ఆశలు

స్కిల్ ఇండియాతో యువతకు ఉద్యోగ భద్రత

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ సిటీల తరహాలో మరో నగర ఏర్పాటుకు మీర్కాన్‌పేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి గురువారం అంకురార్పణ చేశారు. దీంతో ఇక్కడి ప్రజలు, యువతలో ఆశలు చిగురిస్తున్నాయి. కాలుష్య రహిత మహానగరి నిర్మాణానికి సర్కార్ తొలి అడుగు వేసింది. ఉపాధి కల్పన కోసం కాలుష్య రహిత పరిశ్రమల కోసం శ్రీకారం చుట్టింది. 57 ఎకరాల విస్తీర్ణంలో 150 కోట్ల అంచనా వ్యయంతో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుంది. ఫార్మా విజువల్ ఎఫెక్స్, గేమింగ్, బ్యాకింగ్, ఫైనాన్స్, రిటైల్, ఈ కామర్స్, లాజిస్టిక్, ప్యాకింగ్, హార్డ్‌వేర్, ఎలక్ట్రిషన్ వంటి 17 రంగాల్లో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్, మూడేళ్ల డిగ్రీ డిప్లొమా సర్టిఫికెట్, ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ యూనివర్సిటీలో ఏటా లక్షమందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బడ్జెట్ సమావేశాల్లో 'యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ బిల్లు 2024 బిల్లు ప్రవేశపెట్టి అమోదించారు. ఇంజనీరింగ్, పీజీ, డిగ్రీలు పూర్తి చేసిన యువత రాష్ట్రంలో 30 లక్షల మంది ఉండటంతో వారందరికీ ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు వృత్తి నైపుణ్య శిక్షణ యూనివర్సిటీ ఏర్పాటు అవుతుంది. యూనివర్సిటీ భవనం పూర్తయ్యే వరకు అద్దె భవనంలో కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి స్కిల్ ఇండియా యూనివర్సిటీకి భూమి పూజ చేయడంతో యువతలో ఆశలు చిగురించాయి. శిక్షణ పొందిన ప్రతి అభ్యర్థికి ఉపాధి, ఉద్యోగ భద్రత కల్పించనున్నట్లు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించటంతో యువతలో మరింత ఊపునిచ్చింది. కాలుష్య రహిత పరిశ్రమలతో పాటు స్పోర్ట్స్ హబ్, ఎడ్యుకేషన్ హబ్, అధునాతన సౌకర్యాలతో టౌన్‌షిప్‌లు ఏర్పాటు కానున్నాయి. ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన విధంగా మార్పు తీసుకువస్తామన్న హామీ మేరకు ఇక్కడ అనేక ప్రాజెక్టులు రూపుదిద్దుకోనున్నాయి. భూములు కోల్పోయిన రైతులకు సీఎం భరోసా కల్పించారు.

మీ త్యాగాలకు తగిన ఫలితం

- మహాద్భుతంగా కొత్త నగరం
- భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు అండగా ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి
- చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి భూమిపూజ చేసిన సీఎం



రంగారెడ్డి అర్బన్/ఇబ్రహీంపట్నం/కందుకూరు/మహేశ్వరం, ఆగస్టు 1 : బేగరకంచ కేంద్రంగా మహానగరాన్ని అద్భుతంగా నిర్మిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కందుకూరు మండలం మీర్కాన్‌పేట్‌లోని బేగరకంచలో సీఎం రేవంత్‌రెడ్డి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, మోడరన్ స్కూల్, ప్రైమరీ హెల్త్ సెంటర్, కమ్యూనిటీ సెంటర్లకు ఆయన గురువారం సాయంత్రం భూమి పూజచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నెట్ జీరో సిటీ కోసం భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు అండగా ఉంటామని, మీ త్యాగాలకు తగిన ఫలితం ఉంటుందని భరోసా ఇచ్చారు. మీ తాత ముత్తాల భూములు ఈ ప్రాజెక్టు కోసం ఇచ్చారని, మీ కుటుంబాలకు అన్ని రకాలుగా అండగా భద్రతగా ఉంటానని సీఎం తెలిపారు. అవుటర్ రింగ్ రోడ్డు నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 200 ఫీట్ల వెడల్పుతో ఏర్పాటు చేయనున్న రహదారుల పనుల పర్యవేక్షణను మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి అప్పగిస్తున్నట్లు చెప్పారు. అలాగే రీజనల్ రింగ్‌రోడ్డు భూ సేకరణ బాధ్యతను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అప్పగిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ భూములు కోల్పోయిన కుటుంబాలకు అండగా ఉంటామని, చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. వ్యవసాయ భూములు కోల్పోయిన కుటుంబాల్లో చదువుకున్న యువతకు శిక్షణను ఇప్పించి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గమ్యం తెలియక యువత పోరాటాలు చేసి తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును ఆమోదింప చేసుకుని ఇక్కడ వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసుకున్నామని చెప్పారు. ఫార్మాసిటీ ఏర్పాటైతే ఈ ప్రాంతంలో కలుషిత పరిశ్రమలతో మానవాళి మనుగడగే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉండేదన్నారు. అలా కాకుండా మార్పును తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని ఓ మహా నగరంగా తీర్చిదిద్దేందుకు పూనుకున్నామని, ఇది మా చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. నెట్‌జోన్ సిటీగా ఉపాధినిచ్చే పరిశ్రమలే కాకుండా స్పోర్ట్స్ హబ్, ఎడ్యుకేషన్ హబ్, ఆధునిక సౌకర్యాలతో కాలనీలు ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టామన్నారు. పరిశ్రమలకు సంబంధించిన నైపుణ్యం యువతలో లేదనే విషయాన్ని గుర్తించి ఇక్కడ నైపుణ్యాన్ని పెంచే విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నోటిఫికేషన్లు ఇచ్చామని, 40వేల మంది యువతకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చినట్లు తెలిపారు. ఇంజనీరింగ్, డిగ్రీలు పీజీలు చేసి 30లక్షల మంది యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని, నైపుణ్యం లేక ఉద్యోగాలు పొందలేకపోతున్నారని చెప్పారు. భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాలు కేటాయించామని, ఈ స్థలంలో కార్పొరేట్ స్కూల్, ఆసుపత్రి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టి మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. నాట్కో సంస్థ ఇక్కడ స్కూల్ ఏర్పాటుకు ముందుకు వచ్చినట్లు ఆయన చెప్పారు.

ప్రపంచంలో మోడల్‌గా తీర్చిదిద్దుతాం : శేఖర్‌రెడ్డి, క్రెడాయ్ మాజీ అధ్యక్షుడు

మీర్‌ఖాన్‌పేట్‌లో నిర్మించబోయే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రపంచంలోనే మోడల్‌గా తీర్చిదిద్దనున్నట్లు క్రెడాయ్ మాజీ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి చెప్పారు. ఈ యూనివర్సిటీలో చేరిన విద్యార్థి ఏ కోర్సులో నైనా నైపుణ్యంతో బయటకు వచ్చేలా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, జిల్లా కలెక్టర్ శశాంక, జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఐటీ దిగ్గజం మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, రామ్మోహన్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ మంత్రి చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, కోదండరెడ్డి, తీగల కృష్ణారెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, కార్పొరేషన్ ఛైర్మన్లు మల్‌రెడ్డి రాంరెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లేష్, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో లక్ష మందికి శిక్షణ : శ్రీని రాజు, ఐఎస్‌బీ ఫౌండర్, శ్రీ సిటీ అధినేత

ఏడాదిలో లక్ష మందికి శిక్షణ ఇవ్వబోతున్నామని ఐఎస్‌బీ ఫౌండర్ శ్రీ సిటీ అధినేత శ్రీని రాజు అన్నారు. మూడు వారాల క్రితం వ్యాపారవేత్తలతో సమావేశమై సీఎం మూడు వారాల్లోనే ఇక్కడ అద్భుత ప్రాజెక్టుకు రూపకల్పన చేయడం అద్భుతమైన విషయమన్నారు.



వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

శిశువు ఎదుగుదలకు తల్లిపాలు కీలకం

మేడ్చల్ ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తల్లి పాలల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. శిశువు ఆరోగ్యం, ఎదుగుదలలో కీలకపాత్ర పోషిస్తాయి. వాటిలో రోగ నిరోధకశక్తి ఉంటుంది. ఈ నేపథ్యంలో అమ్మపాల ప్రాధాన్యతపై ఏటా ప్రభుత్వం ఆగస్టు మొదటి వారంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తుంది. జిల్లాలో గురువారం ప్రారంభమైన ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను ఐసీడీఎస్, వైద్యారోగ్య శాఖ సంయుక్తంగా నిర్వహించనున్నాయి. గ్రామాలు, మున్సిపాల్టీల్లో అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, పాలిచ్చే తల్లులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. స్త్రీ వైద్య నిపుణులు తల్లిపాల ప్రాధాన్యాన్ని, పుట్టిన వెంటనే శిశువుకు పాలు ఇస్తే కలిగే ప్రయోజనాలు వివరిస్తారు. సాధారణ ప్రసవమైతే గంటలోపు, శస్త్రచికిత్స అయితే 2గంటల లోపు ముర్రు తాగించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు గురువారం అదనపు కలెక్టర్ రాధికాగుప్తా తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రఘునాథస్వామి, సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి, సీడీపీవోలు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

'డైట్'లో అడ్మిషన్లు షురూ

తొలిరోజు 220 మంది సర్టిఫికెట్ల పరిశీలన

వికారాబాద్, ఆగస్టు 1: డైట్ కళాశాలలో అడ్మిషన్లకు ఈ నెల 6వ తేదీ వరకు అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తామని డైట్ ప్రిన్సిపాల్ రామచారి తెలిపారు. గురువారం వికారాబాద్ డైట్ కళాశాలలో అడ్మిషన్లకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. మొదటి రోజు 400మంది హాజరుకావాల్సి ఉండగా 220 మంది వచ్చారు. వారిలో తెలుగు మీడియంలో 203, ఇంగ్లీష్ మీడియంలో 14, ఉర్దూ మీడియంలో ముగ్గురు ఉన్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ నెల ఆరో తేదీ వరకు మొత్తం 1,560మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో రాలేని వారికి మరో రోజు అవకాశం ఇస్తామని, గురువారం రాని వారు శుక్రవారం హాజరుకావొచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

చిగురించిన ఆశలు

కొత్త రేషన్ కార్డులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- జిల్లాలో 40వేల మంది ఎదురు చూపు
- ఇప్పటికే వేలాది దరఖాస్తులు
- కార్డు లేక పథకాలకు దూరం



వికారాబాద్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పేదలకు తెల్లరేషన్ కార్డుల జారీకి ప్రక్రియ మొదలుపెడతామని గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లాలో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు, కొత్తగా దరఖాస్తు చేసుకోవాలనుకునే వారిలో ఆశలు చిగురించాయి. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో రేషన్ కార్డుల జారీపై నిర్ణయం తీసుకున్నారు. వివిధ ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటుండడంతో కార్డులేని వారు పథకాలను పొందలేకపోతున్నారు. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో త్వరలో జిల్లాలో అర్హులకు తెల్ల రేషన్ కార్డులు అందనున్నాయి. రేషన్ కార్డుల కోసం జిల్లాలో 40వేల మంది వరకు ఎదురు చూస్తున్నారు. 2014, డిసెంబరు 31 నుంచి 2024, జూలై 10వ తేదీ వరకు పౌర సరఫరాల శాఖ పోర్టల్‌లో కొత్త రేషన్ కార్డులు, మార్పులు, చేర్పులకు 26వేలకుపైగానే దరఖాస్తు చేసుకున్నారు. కార్డుల్లో పేర్లు తొలగిస్తున్న అధికారులు కొత్తగా మాత్రం చేర్చలేదు. కూతురి వివాహం కాగానే పట్టింటి వారి రేషన్ కార్డులో నుంచి ఆ యువతి పేరు తొలగిస్తున్న అధికారులు అత్తింటి వారి కార్డులో మాత్రం చేర్చడం లేదు. దీంతో పేదలు రేషన్ బియ్యం, ఇతర పథకాలు పొందలేక పోతున్నారు. గ్యారంటీల లబ్ధికి రేషన్ కార్డు లేక చాలా మంది పేదలు ప్రయోజనం పొందలేక పోతున్నారు. రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు వేర్వేరుగా జారీ చేస్తారు. జిల్లాలో ప్రస్తుతం 2,41,179 రేషన్ కార్డులున్నాయి. 8,09,218 మంది సభ్యులు నమోదై ఉన్నారు. ఆహార భద్రత కార్డులు 214503, అంత్యోదయ ఆహార భద్రత కార్డులు 26640, అన్నపూర్ణ అన్న యోజన కార్డులు 36 ఉన్నాయి. కాగా గత డిసెంబర్‌లో ఆరు గ్యారంటీ కోసం నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల్లో భాగంగా చాలా మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

పదేళ్లకు పైగానే పేదల ఎదురు చూపులు

రేషన్ కార్డుల కోసం పేదలు పదేళ్లకుపైగా ఎదురు చూస్తున్నారు. కొత్త కార్డుల జారీ లేదు. పాత కార్డుల్లోనూ మార్పులు, చేర్పులు చేయలేదు. వివాహమైన కుటుంబంలో కొత్తగా చేరిన కోడళ్లు, జన్మించిన పిల్లల పేర్లు రేషన్ కార్డుల్లో చేర్చలేదు. ఉమ్మడి కుటుంబాల నుంచి వేరు కాపురం పెట్టిన వారు కూడా రేషన్‌కార్డు పొందలేదు. కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం లేక పాత కోటా ప్రకారమే రేషన్ పంపిణీ చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

'స్వచ్ఛదనం-పచ్చదనం'ను విజయవంతం చేయాలి

వికారాబాద్, ఆగస్టు 1: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ఈ కార్యక్రమంలో చేపట్టాల్సిన అంశాలపై గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆగస్టు 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కింద చేపట్టే అంశాలపై ఆమె కలెక్టర్లకు వివరించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులనుద్దేశించి మాట్లాడారు. రోజువారీగా చేపట్టే పనులపై దృష్టి సారించాలన్నారు. స్వయం సహాయక సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాధులు, ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, అంగన్వాడీలు, ఆరోగ్య కేంద్రాలు, బస్‌స్టాపుల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, పద్య గేయాల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేయాలని డీఈవోకు సూచించారు. అవెన్యూ ప్లాంటేషన్‌కు స్థలాలను గుర్తించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్డీవో శ్రీనివాస్, డీపీవో జయసుధ, డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్, పీఆర్ ఈఈ ఉమేష్, పశుసంవర్ధక శాఖ అధికారి పూర్ణచంద్రరావు, ఆర్ అండ్‌బీ ఇన్‌చార్జి ఈఈ శ్రీధర్‌రెడ్డి, మెప్మా పీడీ రవి కుమార్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ప్రిన్సిపాళ్లు, జేఎల్‌ల బదిలీ

జూనియర్ కాలేజీల్లో బదిలీల ప్రక్రియ పూర్తి

వికారాబాద్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, ముగ్గురు లెక్చరర్లు బదిలీ అయ్యారు. తాండూరు కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.రాజ్‌మోహన్‌రావు తుంగతుర్తికి బదిలీ అయ్యారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి, కొడంగల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.శంకర్ తాండూరుకు, మర్పల్లి ప్రిన్సిపాల్ ఎస్.నర్సింహారెడ్డి కొడంగల్‌కు బదిలీ అయ్యారు. వికారాబాద్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆర్ఎం.సురేశ్వరస్వామి నవాబ్‌పేట్‌కు, సంగారెడ్డి జిల్లా కోహీర్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు వికారాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. నవాబ్‌పేట్ కాలేజీ ప్రిన్సిపాల్ యు.శోభారాణి సంగారెడ్డి బాలుర కాలేజీకి, మోమిన్‌పేట కాలేజీ ప్రిన్సిపాల్ బి.చెన్నయ్య ఓల్డ్ మలక్‌పేట్ కాలేజీకి వెళ్లనున్నారు. సిద్దిపేట జిల్లా ములుగు కాలేజీ ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి మోమిన్‌పేటకు రానున్నారు. దోమలో పనిచేసిన మంజుల మొగిలిగిద్దకు బదిలీ కాగా దోమకు కూకట్‌పల్లి కాలేజీ ప్రిన్సిపాల్ రూపలక్ష్మి రానున్నారు. కాచిగూడ కాలేజీ ప్రిన్సిపాల్ స్వర్ణలత మర్పల్లికి రానున్నారు.

23 గ్రామాలు మున్సిపాల్టీల్లో విలీనం

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రక్రియ
- శివారు జిల్లాల గ్రామాలు మేడ్చల్ జిల్లాలోకి..
- దాదాపు వంద గ్రామాలతో మారనున్న స్వరూపం



మేడ్చల్ ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 23 గ్రామాలను సమీప మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో విలీనం చేసి ఆ తర్వాత జీహెచ్ఎంసీలో కలిపేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే జిల్లాలో ఎక్కువ భాగం జీహెచ్ఎంసీ పరిధిలో ఉంది. జిల్లాలో 61 గ్రామాలే ఉన్నాయి. వాటిల్లో 23గ్రామాలు మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లలో కలుస్తుండటంతో ఇక జిల్లాలో 38 గ్రామాలే మిగలనున్నాయి. జిల్లాలో 38 గ్రామాలే మిగలనున్నాయా? మిగిలిన పంచాయతీల పరిస్థితి ఏమిటనే సందిగ్ధంలో ప్రజలున్నారు. 23గ్రామాలను సమీప మున్సిపాల్టీల్లో కలుపనున్నారు. ఔటర్‌కు వెలుపలి గ్రామాలూ మున్సిపాల్టీల్లో కలవనున్నాయి. విలీన కసరత్తులో జిల్లా యంత్రాంగం లీనమైంది. ఔటర్ రింగు రోడ్డు చుట్టూ ఉన్న చాలా గ్రామాలు వాటి సమీపంలోని మున్సిపాల్టీల్లో విలీనం కానున్నాయి. దీనిపై నేడు డ్రాఫ్ట్(ముసాయిదా) బిల్లు ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే విలీన గ్రామాల సరిహద్దులు, రెవెన్యూ హద్దుల నివేదికను అధికారులు ప్రభుత్వానికి అందజేశారు. పట్టణ ప్రాంతాలు పోను మిగిలిన రూరల్ జిల్లా రూపు రేఖలు ఎలా ఉండనున్నాయో అన్న చర్చ ప్రజల్లో జోరుగా నడుస్తున్నది. 15మండలాలతో ఏర్పడిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 40 జీహెచ్ఎంసీ డివిజన్లు, నాలుగు కార్పొరేషన్లు, 9 మున్సిపాల్టీలు, 61 గ్రామ పంచాయతీలున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే జిల్లాలను కుదిస్తారని, జీహెచ్ఎంసీని రెండు లేదా నాలుగు జోన్లుగా విభజిస్తారనే ప్రచారం జోరుగా జరిగింది. అందులో భాగంగానే పలు గ్రామాలను మున్సిపాల్టీల్లో విలీనం చేస్తుండటంతో మిగిలిన గ్రామాల పరిస్థితి ఎలా ఉంటుంది? అసలు జిల్లా ఉనికలో ఉంటుందా? ఉండదా? మిగిలిన గ్రామాలనూ మున్సిపాల్టీలుగా ఏర్పాటు చేస్తారా? అనే ప్రశ్నలు ప్రజల్లో మెదులుతున్నాయి.

70కి పైగా పొరుగు జిల్లాల గ్రామాలు కొత్తగా చేరిక

కాగా మేడ్చల్-మల్కాజిగిరి పొరుగు జిల్లాలైన మెదక్, యాద్రాద్రి-భువనగిరి జిల్లాల నుంచి పలు గ్రామాలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కలిపేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం. దీనిపై ఇప్పటికే అధికారులు నివేదిక కూడా తయారు చేస్తున్నట్లు తెలిసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 23 గ్రామాలను ప్రస్తుతం మున్సిపాల్టీల్లో విలీనం చేసి 2026లో జరిగే జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి శివారు మున్సిపాల్టీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు సమాచారం. మెదక్ జిల్లా మనోహరాబాద్, యాదాద్రి-భువనగిరి జిల్లా నుంచి బొమ్మల రామారం, బీబీ నగర్ తదితర ఐదు మండలాల్లోని దాదాపు 70కిపైగా గ్రామాలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కలిపేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. జీహెచ్ఎంసీ పరిధి పెంచడంతో పాటు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాను కూడా విస్తరింపజేసే విధంగా అధికారులు నివేదిక తయారు చేస్తున్నట్లు తెలిసింది. ఇదే గనక జరిగితే మేడ్చల్ జిల్లా రూపు రేఖలు పూర్తిగా మారనున్నాయి.

తాండూరులో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

బీజేపీ నేత యు.రమేష్‌కుమార్



మాట్లాడుతున్న రమేష్‌కుమార్

తాండూరు రూరల్, ఆగస్టు 1: తాండూరులో ఈఎస్‌ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్‌కుమార్ అన్నారు. తాండూరు పట్టణ బీజేపీ కార్యాలయంలో గురువారం బీజేపీ కార్యనిర్వాహక సభ్యులు శేఖాపురం ఆంజనేయులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూరు ప్రాంతంలోని నాపరాతి గనులు, సుద్ధ గనులు వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్నాయని, వాటిలో వేలాది మంది కార్మికుల పనిచేస్తున్నారని అన్నారు. వారికి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం వెంటనే ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, వైద్యం, విద్యుత్, ఆరోగ్యం వంటి సమస్యలతో ప్రజలు అనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖాపురం ఆంజనేయులు మాట్లాడుతూ.. తాండూరులో నిరుద్యోగ సమస్య ఉందని, సీసీఐ కర్మాగారాలు ఉన్నప్పటికీ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు దొరకడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీవీ బసవరాజ్, మండల అధ్యక్షుడు ప్రభుశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, అసెంబ్లీ కన్వీనర్, రజనీకాంత్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీహరి, బీజేపీ నాయకులు వడ్ల విజయ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సర్టిఫికెట్ల జారీ అధికారం ఎమ్మార్వోలకే ఇవ్వాలి

శాసన మండలిలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 1: వారసత్వ సర్టిఫికెట్లు జారీ చేసే అధికారం మండల ఎమ్మార్వోలకే ఇవ్వాలని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం శాసన మండలిలో ఆయన మాట్లాడారు. వారసత్వ సర్టిఫికెట్లను గతంలో ఎమ్మార్వోలే ఇచ్చేవారని, ప్రస్తుతం అట్టి అధికారం కోర్టులకు అప్పగించారని గుర్తుచేశారు. వారసత్వ సర్టిఫికెట్ కోసం కోర్టుకు వెళితే అధిక డబ్బుతో పాటు కాలయాపన జరుగుతున్నదన్నారు. ప్రమాదాలకు గురవుతున్న పేదలు ఆర్థిక సమస్యలతో సరైన వైద్యం పొందలేక ప్రాణాలు కోల్పోతున్నారని, పట్టణాల్లోని ప్రతీ ప్రైవేట్ ఆసుపత్రికి ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేసి, క్షతగాత్రుల ప్రాణాలను కాపాడాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల ముందు, ఆ తరువాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సైతం ప్రతీ రైతుకు రెండు లక్షల వరకు పంట రుణాన్ని మాఫీ చేస్తామన్న ప్రభుత్వం.. ఇప్పుడు కుటుంబానికి రెండు లక్షలు, రేషన్ కార్డు ఉండాలంటూ తప్పించుకునే ప్రయత్నం చేయవద్దని కోరారు. రేషన్ కార్డు, కుటుంబంతో సంబంధం లేకుండా ప్రతీ రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలుపుకోవాలని నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు.

'అనురాగ్' విద్యార్థులకు ఇండియా డిజైన్ వీక్-2024 అవార్డు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న అధ్యాపకులు

ఘట్‌కేసర్‌రూరల్, ఆగస్టు 1: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థులకు ఇండియా డిజైన్-2024 వీక్ స్పెషల్ జ్యూరీ అవార్డు లభించింది. అనురాగ్ యూనివర్సిటీ మెకానికల్ విభాగానికి చెందిన విద్యార్థులు మహేష్, కౌశిక్, చరణ్‌సన్ని, సజీద్‌లు చెన్నైలో జరిగిన ఇండియా డిజైన్-2024 కాంపిటీషన్‌లో పాల్గొని తయారు చేసిన 'వాటర్ గార్బేజ్ కలెక్టర్ డిజైన్ చేశారు. ఇందుకు గానూ స్పెషల్ జ్యూరీ అవార్డు లభించింది. దీంతో స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ విజయ్‌కుమార్, మెకానికల్ హెచ్‌వోడీ శ్రీనివాస చలపతి, అధ్యాపకులు జూష్‌కుమార్‌లు విద్యార్థులను అభినందించారు.

హోంగార్డుకు రివార్డు

యాచారం, ఆగస్టు 1: ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆవరణలో ఇటీవల మహిళపై అత్యాచారం చేసి పరారైన నిందితుడిని మాల్‌లో హోంగార్డు మహేందర్ పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. హోంగార్డుకు సీపీ శ్రీనివాస్‌రెడ్డి గురువారం రూ.3వేల నగదు రివార్డు అందించారు.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్థభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొన సాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది.

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి.. ముండక్కై, చురాల్‌మలలో పర్యటన
» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి
» 289కి పెరిగిన మరణాలు

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.



పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అష్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!
» జూలై 13న గాజాలో అంతం చేశాం
» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం
» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్టు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.

కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై
మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

» హిమాచల్‌లో క్లౌడ్ బరస్ట్‌తో కుంభవృష్టి!
» 50 మంది గల్లంతు.. ఐదుగురి దుర్మరణం
» ఉత్తరాఖండ్‌లో రాత్రివేళ పోటెత్తిన వరద
» రాష్ట్రవ్యాప్తంగా వర్షాలకు 12మంది మృతి

శిమ్లా, డెహ్రాడూన్, జైపూర్, ఆగస్టు 1: ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్‌లో క్లౌడ్ బరస్ట్‌తో కులు, పధార్, మండి, శిమ్లా జిల్లాలను వరద ముంచెత్తింది. 50 మంది గల్లంతవగా.. వీరిలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇళ్లు, బ్రిడ్జిలు, రోడ్లు కొట్టుకుపోయాయి. దీంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. శ్రీఖండ్ మహదేవ్ సమీపంలో బుధవారం రాత్రి క్లౌడ్ బరస్ట్‌తో సర్పారా, గాన్వీ, కుర్బన్ నల్లాల్లో మెరుపు వరదలు సంభవించాయి. పార్వతి నదిపై మలానా డ్యామ్ కొట్టుకుపోయి దిగువ ప్రాంతాలను నీరు ముంచెత్తింది. శిమ్లా జిల్లా రాంపూర్‌లోని సమేజ్‌ఖడ్‌లో 30 మంది కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరు మృతిచెందారు. మండి జిల్లా తెరాంగ్ సమీపంలోని రాజ్‌బన్ గ్రామం వద్ద మరో క్లౌడ్ బరస్ట్ జరిగింది. ఏడుగురు గల్లంతవగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. కాగా, ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం న మోదైంది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.



వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు
» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.



ప్రజాసేవ చేసేవారికి దైవాశీస్సులు

● పోతాయిపల్లి నుంచి అయోధ్యకు బీజేపీ నాయకుల సైకిల్ యాత్ర
● ప్రారంభించిన ఎంపీ ఈటల సతీమణి జమున

శామీర్‌పేట, ఆగస్టు 1: నిరంతరం ప్రజాసేవ చేసే వారికి దైవాశీస్సులు, అనుగ్రహం ఎప్పటికీ ఉంటాయని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల సతీమణి ఈటల జమున అన్నారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని పోతాయిపల్లిలో గల శ్రీరామభద్రక్షేత్రం వద్దకు గురువారం ముఖ్యఅతిథిగా ఆమె విచ్చేసి బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తూంకుంట నుంచి అయోధ్యకు వెళ్లే సంకల్ప సైకిల్ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. సైకిల్‌యాత్ర దిగ్విజయం అయ్యేందుకై శ్రీరామభద్ర ఆలయంలో వేదాంత బ్రహ్మణ పండితుడు పండరీ సంతోష్‌కుమార్ ప్రత్యేక సంకల్ప పూజ, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల జమున మాట్లాడుతూ.. 4 లక్షల మెజార్టీతో ఎంపీగా ఈటల రాజేందర్ గెలుపొందితే బీజేపీ కార్యకర్తలు, అభిమానులు సైకిల్‌యాత్రను నిర్వహిస్తామని ఇక్కడి శ్రీరామభద్ర ఆలయంలో మొక్కుకున్నట్లు తెలిపారు. దైవానుగ్రహంతో, ఆశీస్సులతో తన భర్త ఈటల రాజేందర్ అత్యధిక మెజార్టీతో ఎంపీగా గెలుపొందారని తెలిపారు. ప్రజలకు సేవ చేసేవారు ఎప్పటికీ ఉన్నత స్థానంలో ఉండేందుకు ఎదుగుతారని ఆమె వివరించారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ప్రజల సహకారంతో, భగవంతుని ఆశీస్సులతో రాజకీయాలకతీతంగా అన్నిరంగాల్లో ఉత్తమ అభివృద్ధి పనులను చేపట్టడమే ఎంపీ ఈటల రాజేందర్ ధ్యేయమని, తమ ఆశయమని ఆమె వెల్లడించారు. బీజేపీ కార్యకర్తలు చేపట్టిన సైకిల్‌యాత్ర విజయవంతం కావాలని శ్రీరామభద్రుడ్ని వేడుకుంటున్నట్లు ఆమె చెప్పారు. కాగా తూంకుంటకు చెందిన బీజేపీ కార్యకర్తలు కాసుల కరుణాకర్, కాసుల సుభాష్‌చంద్రబోస్, రాజారెడ్డి, హుజురాబాద్‌కు చెందిన మరో ఇద్దరు పార్టీ కార్యకర్తలు సంకల్పయాత్రగా సైకిళ్లపై తూంకుంట నుంచి అయోధ్యకు బయల్దేరారు. 15 రోజుల నుంచి 20రోజుల వరకు ఈ అయోధ్య సంకల్పయాత్రను దిగ్విజయంగా పూర్తిచేసుకుని అయోధ్యలో శ్రీరాముడి దర్శనం చేసుకుని వస్తామని కాసుల కరుణాకర్, సుభాష్‌చంద్రబోస్, రాజారెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాసుల నర్సింగ్‌రావుగౌడ్, కాసుల ఈశ్వర్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జెండాఊపి సైకిల్‌యాత్రను ప్రారంభిస్తున్న ఈటల జమున

ఎస్సీ వర్గీకరణపై తీర్పు సంతోషకరం

అసెంబ్లీలో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య



చేవెళ్ల, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై కృతజ్ఞతలు చెబుతున్నామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రసంగించారు. ఎస్సీ రిజర్వేషన్లలో మాదిగ, మాదిగ ఉపకులాల ఏవర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాటం చేసిన మాదిగ అమరులకు జోహార్లు అర్పిస్తున్నామన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు ముందుండి పని చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. ఎస్సీ రిజర్వేషన్లలో మాదిగలు, మాదిగ ఉపకులాలకు ఉద్యోగాలు, విద్యా సంస్థల అడ్మిషన్లలో ప్రాముఖ్యత కల్పించాలని కోరారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 1: కందుకూరు మండల పరిధిలోని నేదునూరు మోడల్ పాఠశాల, కళాశాల విద్యార్థులకు రోడ్డు సౌకర్యం కల్పించాలని వందేమాతరం విద్యార్థి సేవా ఫోర్స్ అధ్యక్షుడు ఊటు మహేందర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంకను కలిసి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేదునూరు మోడల్ స్కూల్, కళాశాల వరకు రోడ్డు మంజూరు చేయడంతో పాటు బస్సు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చాలని కోరినట్లు తెలిపారు. కందుకూరు మండలంలోని అన్ని గ్రామాలకు బస్సుల సౌకర్యాలు పెంచాలన్నారు. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ డీఈవోకు విషయం చెప్పారు. దీనితో పాటు కావాల్సిన మౌలిక వసతులను తొందరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పుచ్చల విష్ణు, రమేశ్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

అక్రమంగా ఎర్రమట్టి తరలింపు

మొయినాబాద్, ఆగస్టు 1 : మండల పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూలోని ప్రభుత్వ భూమిలోంచి అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్నారు. పెద్దమంగళారం-చందానగర్ వెళ్లే రోడ్డు పక్కన సర్వేనెంబర్ 218 ప్రభుత్వ భూమి నుంచి కొంతమంది అక్రమార్కులు ఎర్రమట్టి తలిస్తున్నారు. రెండు రోజులుగా ఎర్రమట్టి తలిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వ భూమిలోంచి దొంగతనంగా మట్టిని జేసీబీతో తవ్వి టిప్పర్‌లో తరలిస్తున్నారు. ఎక్కడి తీసుకెళుతున్నారని అడిగితే డ్రైవర్లు చెప్పడం లేదని గ్రామస్తులు చెప్పారు. అధికారులు స్పందించి మట్టి తరలింపును ఆపాలని కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణపై అనుకూల తీర్పు హర్షదాయకం


తాండూరు రూరల్: తాండూరు అంబేద్కర్ చౌక్‌లో విజయోత్సవ సంబురాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు


మేడ్చల్ టౌన్: సంబురాల్లో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

తాండూరు రూరల్, ఆగస్టు 1: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షదాయకమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కోడిగంటి మల్లికార్జున్ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో కేసు గెలుపొందిన సందర్భంగా గురువారం తాండూరులో ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌక్ వద్ద ప్రధాని మోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ మాట్లాడుతూ.. రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకు 30ఏళ్లుగా మాదిగ దండోరా ఉద్యమం చేసినట్లు తెలిపారు. అనంతరం టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నర్సింహులు మాదిగ, డి.కృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ప్రకాష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మెట్లి ఆశన్న మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ శివాజీ, కో-కన్వీనర్ జాని, జిల్లా కార్యదర్శి డప్పు మహేందర్, ఎమ్మార్పీఎస్ నాయకులు అరవింద్, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పునివ్వడం పట్ల ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. ఘట్‌కేసర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లేష్, నాయకులు నాగేష్, శివకుమార్, శ్రీనివాస్, అరుణ్‌కుమార్, జగన్ పాల్గొన్నారు.

పరిగి: పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంబురాలు నిర్వహించారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు సానుకూలమైన తీర్పు ఇచ్చిన నేపథ్యంలో గురువారం సాయంత్రం పరిగిలో సంబురాలు జరుపుకున్నారు. అంబేద్కర్, బాబూజగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు శ్రీనివాస్ బుచ్చన్న, నరసింహరాజు, అంజయ్య, నరేందర్, లక్ష్మీనరసింహ్మ, కరుణాకర్, రాజేందర్, కృష్ణబాబు, వెంకటయ్య, పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: ఎస్సీల వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మేడ్చల్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎస్‌వై.అశోక్, జిల్లా యువసేన అధ్యక్షుడు పరుశురాం, నాయకులు బాలనర్సింహా, ప్రభాకర్ పాల్గొన్నారు.

కొడంగల్: ఎస్సీ ఎస్టీ వర్గీకరణ కోసం సుప్రీం కోర్టు తీర్పును ఇవ్వడం హర్షనీయమని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఎస్.సోమశేఖర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత 30 సంవత్సరాలుగా వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్న మాదిగ దండోరా ఎమ్మార్పీఎస్ ఉద్యమంతో ఫలితం దక్కిందన్నారు. ఉద్యమంలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ, ఉద్యమానికి సహకరించిన రాజకీయ పార్టీలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

బొంరాస్‌పేట్: రాజ్యాంగం ద్వారా సమాన అవకాశాలు, సమాన హక్కుల కోసం కల్పించిన ఎస్సీ వర్గీకరణ పట్ల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఎంతో చరిత్రాత్మకమైందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తోలు వెంకటయ్య గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటారని ఆయన తెలిపారు.

పెద్దేముల్‌లో ట్రెయినీ కలెక్టర్ రెండోరోజు పర్యటన


రైతులతో మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి

పెద్దేముల్, ఆగస్టు 1: పెద్దేముల్ మండలంలో ట్రెయినీ కలెక్టర్ ఉమా హారతి రెండవ రోజు గురువారం పర్యటించి సర్వే విధానాన్ని పరిశీలించారు. కందనెల్లి తండా సమీపంలో సర్వేకోసం రైతులు చేసుకున్న దరఖాస్తుపై ట్రైనీకలెక్టర్ సమక్షంలో సర్వేయర్ భూమి సర్వే చేశారు. రైతులను పంటల సాగు వివరాలు, లాభనష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ధరణి సమస్యల పరిష్కారం విషయమై ట్రెయినీ కలెక్టర్ తహసీల్దార్‌ను ఆరాతీశారు. ఆమె వెంట మండల తహశీల్దార్ కిషన్, జూనియర్ అసిస్టెంట్ మహేష్, సర్వేయర్ శ్రీహరి తదితరులు ఉన్నారు.

వైభవంగా బోనాలు


ఉత్సవాల్లో పోతరాజుల విన్యాసాలు

మోమిన్‌పేట్, ఆగస్టు 1: మండల కేంద్రంతో పాటు మండలంలోని టేకులపల్లి గ్రామాల్లో గురువారం ఎల్లమ్మ, దుర్గమ్మకు బోనాలు ఘనంగా నిర్వహించారు. ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఫలహారం బండి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

సెక్యూరిటీ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

ఘట్‌కేసర్, ఆగస్టు 1: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో అకారణంగా తొలగించిన సెక్యూరిటీ సిబ్బందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. టౌన్‌షిప్‌లో గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సెక్యూరిటీ సిబ్బంది ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కల్లూరి జయచంద్ర, వి.హరినాథ్ రావు మాట్లాడుతూ 20సంవత్సరాలుగా పనిచేస్తున్న 70మంది సెక్యూరిటీ సిబ్బందిని అకారణంగా పనిలోంచి తొలగించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అసోసియేషన్ నిర్వాహకులు స్పందించి విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, ఈశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు అన్యాయం

కొడంగల్, ఆగస్టు 1: మధ్యాహ్న భోజన కార్మికులకు అన్యాయం చేయడం సరైంది కాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం హరే రామ హరే కృష్ణ స్వచ్ఛంద సంస్థను తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు టిఫిన్, మధ్యాహ్న భోజనం పేరుతో భోజన కార్మికులకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామకృష్ణ, కార్మికులు వెంకట్, లత, లక్ష్మి, వెంకటమ్మ, సరిత, లావణ్య పాల్గొన్నారు.

ఉపాధి ఎఫ్ఐపై చర్యలు తీసుకోవాలి

పరిగి, ఆగస్టు 1: మండలంలోని మిట్టకోడూరు గ్రామంలో చేపట్టిన ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్‌అసిస్టెంట్ మల్లయ్యపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు గురువారం పరిగి ఎంపీడీవో, ఏపీవోలకు విపతిపత్రాలను అందజేశారు. పనులకు రాకుండానే మస్టర్‌లో పేర్లు రాయించి కూలీలు, ఎఫ్ఏ పంచుకుంటున్నారని తెలిపారు. విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై సీఎం చేసిన వాఖ్యలను నిరసిస్తూ గురువారం జిల్లాలోని పలు మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన కూడళ్ల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసన కారులను పోలీసులు అరెస్ట్ చేశారు.


వికారాబాద్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


పరిగి: సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు


దౌల్తాబాద్: బీఆర్ఎస్ నాయకుల నిరసన


ధారూరు: నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు


తాండూరు: నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

5న మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం

● హాజరుకానున్న స్పీకర్, మంత్రులు

బషీరాబాద్, ఆగస్టు 1: ఈనెల 5న బషీరాబాద్ మండల మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారానికి ఎట్టకేలకు ముహూర్తం ఖరారయ్యింది. ఈ మేరకు ఆ పార్టీ శ్రేణులు ధారాసింగ్, నర్సిరెడ్డి, రామునాయక్ గురువారం వెల్లడించారు. ఈ ప్రమాణసీకారోత్సవానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో పాటు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరుకానున్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా జి.మాదవరెడ్డి, వైస్ ఛైర్మన్‌గా మూడవత్ చందర్, సభ్యులుగా ఎన్.నరేష్, షేక్ మునీర్, నదీర్గా మోహన్, నరేష్‌రథోడ్, సోంపల్లి వనమాల, కె.మహేందర్‌రెడ్డి, వడ్డే హన్మంతు, వీకే.పెంటప్ప, అగ్గనూర్ సతీశ్, కోవ్వూరి నరేష్, ఈ.పాండరంగ, అనూప్‌ప్రసాద్, పీఏసీఎస్ ఛైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, బషీరాబాద్ ప్రత్యేకాధికారి పేర్లను ప్రకటిస్తూ జూలై మొదటి వారంలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఆదే రోజు బషీరాబాద్ నుంచి జీవన్గి కాగ్నానది బ్రిడ్జి మీదుగా కరన్‌కోట్ వరకు రూ.30కోట్లతో డబుల్ రోడ్డు, బషీరాబాద్‌లో రూ.3 కోట్లతో నూతనంగా నిర్మించనున్న ఆర్‌అండ్‌బీ అతిథిగృహం(గెస్ట్‌హౌస్) నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపనలు చేస్తారని వారన్నారు. ఈ క్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఏఈ శ్రావణ్, స్థానిక నాయకులతో కలిసి గురువారం పనుల శంకుస్థాపనకు దిమ్మెల ఏర్పాట్లను పరిశీలించి వెళ్లారు.

4 నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 1: మండలంలోని ఎదులాబాద్‌లోని ప్రాచీనమైన శ్రీగోదా సమేత మన్నారు రంగనాయకస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 4 నుంచి 11 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త టీపీ లక్ష్మాణాచార్యులు తెలిపారు. 4న విష్వక్సేనారాధాన, పుణ్యాహవాచనం, రుత్వికరణము, కౌతుక బంధనము, మృత్సంగ్రహణము, అంకురార్పణ, ఆరగింపు, తీర్థప్రసాద వినియోగము, 5న నిత్యవిధి ధ్వజారోహణము, సాయంత్రం భేరిపూజ దేవతాహ్వానము, 6న నిత్యవిధిశేషవాహన సేవ, హనుమంత వాహనసేవ, 7న అశ్వవాహన సేవ, ఆండాళ్ తిరునక్షత్రం అభిషేకం, గజవాహన సేవ, 8న గోదా రంగనాయక స్వామి కల్యాణం, సాయంత్రం గరుడ సేన, 9న స్వామివారి దివ్యవిమాన రథోత్సవము, 10న మహాపూర్ణాహుతి, దేవతోద్వాసన, ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగం, గాంధోళి ఉత్సవం, చక్రతీర్థం, 11న స్వామివారి ఘటాభిషేకం, మహదాశీర్వచనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఆలయ ధర్మకర్తలు కోరారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్

తాండూరు రూరల్, ఆగస్టు 1: తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయం ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నోటిఫికేషన్ విడుదలైనట్లు కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ దేవాలయం కార్యనిర్వాహకాధికారి జి శేఖర్‌గౌడ్ తెలిపారు. ఆసక్తిగల వారు నోటిఫికేషన్ విడుదల చేసిన 25రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అయితే ధర్మకర్తల మండలి నియామకానికి ఒక చైర్మన్‌తోపాటు ఆరుమంది డైరెక్టర్లు ఉండాలని అన్నారు.

వీధికుక్కల నియంత్రణకు చర్యలు

కీసర రూరల్, ఆగస్టు 1: వీధి కుక్కల నియంత్రణకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం బ్లూ క్రాస్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధికుక్కల నియంత్రణలో భాగంగా నాగారం మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్(ఏబీసీ)ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ సెంటర్‌లోనే కుక్కలకు శస్త్ర చికిత్స జరిపించేలా బ్లూ క్రాస్ సొసైటీ ప్రతినిధులతో ఒప్పందం చేసుకుంటున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్, డీఈఈ సుదర్శనం రఘు, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, బ్లూ క్రాస్ సొసైటీ ప్రతినిధి కుమారి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువకుడికి సపర్యలు



కొడంగల్‌లో ఓ మతిస్థిమితం లేని యువకుడికి అమ్మనాన్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం కటింగ్, స్నానం చేయించి నూతన వస్త్రాలు అందజేశారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రవీణ్‌కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. - కొడంగల్

సంక్షిప్తంగా..

● **పరిగి:** పరిగిలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రాంచందర్, వేముల పెంటయ్య, పట్టణ అధ్యక్షకార్యదర్శులు బాలకిష్టారెడ్డి, వార్ల ఆంజనేయులు, టీవీ నర్సింహులు, కె.శ్రీశైలం, నర్సింహులు, రాజు, సాయబన్న పాల్గొన్నారు.

● **వికారాబాద్:** వికారాబాద్ మునిసిపల్ సాధారణ సమావేశం ఈ నెల 3న నిర్వహించనున్నట్లు మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

● **కులకచర్ల:** స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని ఎంఈవో హబీబ్ అహ్మద్ అన్నారు. అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం చౌడాపూర్ మండల పరిధిలోని మరికల్, బడెంపల్లి ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు బ్యాగులు, మ్యాట్లు, చెప్పులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంకిత స్వచ్ఛంద సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్, జీహెచ్ఎం స్వర్ణమంగళం, హెచ్ఎంలు నారాయణ, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **పూడూరు:** 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయులకు రెండు రోజజుల శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గురువారం మండల యూనిట్‌గా మన్నెగూడ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణను కాంప్లెక్స్ సముదాయాల చైర్‌పర్సన్ తర్ప, జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ హన్మంత్ రెడ్డి, పుష్ప ప్రారంభించారు.

● **దోమ:** మండలంలోని బడెంపల్లి గ్రామంలో గురువారం బొడ్రాయి ఊరడమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపనలో మాజీ జడ్పీటీసీ కె.నాగిరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కవిత శ్రీనివాస్‌రెడ్డి, సుజన దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

● **ఘట్‌కేసర్:** మాజీ ఎంపీటీసీ గడ్డం మహేష్ ఇటీవల దారుణ హత్యకు గురికావడం బాధాకరమని ఘట్‌కేసర్ మున్సిపల్ కౌన్సిలర్ మేకల పద్మారావు అన్నారు. గడ్డం మహేష్ జయంతి సందర్భంగా గురువారం ఆయన కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

● **మేడ్చల్ టౌన్:** 13వ వార్డులో అంగన్‌వాడీ ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం స్థానికంగా ఉన్న పలువురు పిల్లల తల్లులు మేడ్చల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు.

● **కులకచర్ల:** రూ.2లక్షల పంట రుణమాఫీలో కులకచర్ల సొసైటీ పరిధిలోని 1309 మంది రైతులకు రూ.10.64 కోట్లు మాఫీ జరిగినట్లు చైర్మన్ కనకం మొగులయ్య తెలిపారు. గురువారం ఆయన సీఈవో బక్కారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్, పరిగి బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. 2018నుంచి 2023 డిసెంబర్ 9 వరకు అప్పటి డీసీసీబీ చైర్మన్, ప్రస్తుతం తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో సొసైటీకి జిల్లాలోనే అత్యధికంగా రుణాలు అందించినట్లు తెలిపారు.

● **కులకచర్ల:** గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీవో కరీం తెలిపారు. గురువారం మండలంలోని పీరంపల్లి గ్రామ పంచాయతీలో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంజీవ్‌కుమార్, టీఏ నరేశ్, వెలుగు సిబ్బంది వెంకటయ్య పాల్గొన్నారు.

● **దోమ:** జనాభా ప్రాతిపదికన ముదిరాజ్‌ల రిజర్వేషన్ బీసీ డీ ఉంచి బీసీ ఏలోకి మార్చిజీవో నెం.15ను పునరుద్ధరించాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం తహసీల్దార్ పురుషోత్తంకు వారు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చందు, సంజీవ్‌కుమార్, గోవర్ధన్, చంద్రశేఖర్, మోహన్, వెంకట్రాములు పాల్గొన్నారు.

● **మోమిన్‌పేట్:** ప్రతీ గ్రామం పచ్చదనంతో ఉండాలని మండల ప్రత్యేకాధికారి జయశంకర్ అన్నారు. బురుగుపల్లి, రాళ్లగూడుపల్లి, కాస్లబాద్, లచ్చానాయక్ తండాల్లో గురువారం గ్రామ సభలు నిర్వహించి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** అవుషాపూర్, అంకుశాపూర్, మాధారం గ్రామాలను కొత్తగా ఏర్పడనున్న ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో కలపాలని కోరుతూ గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు చలువాది ప్రవీణ్‌రావు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

● **తాండూరు/దోమ:** తాండూరు మునిసిపాలిటీలో విధులు నిర్వర్తిస్తూ కార్మికురాలు పుష్పాలత మృతిచెందగా కుటుంబానికి తోటి కార్మికులు జవాన్లు కలిసి గురువారం రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. దోమ మండలంలోని గుండాల్ గ్రామానికి చెందిన చిన్న మల్లప్ప అనారోగ్యంతో గురువారం మృతి చెందగా బాధిత కుటుంబానికి గ్రామస్థుడు ప్రభాకర్‌రెడ్డి రూ.5వేలు అందజేశారు.

● **పెద్దేముల్:** రైతులకు 2లక్షల రుణమాఫీ చేసినందుకు టీపీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, కోట్‌పల్లి మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ నారాయణరెడ్డిల ఆధ్వర్యంలో రుక్మాపూర్ గ్రామస్థులు గురువారం ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివలీల, నాయకులు చంద్రప్ప, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

పెద్దేముల్, ఆగస్టు 1: సారా తయారుచేస్తున్న స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు చేశారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయబాస్కర్‌గౌడ్ ఆదేశానుసారం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు, మోమిన్‌పేట్ ఎక్సైజ్ పోలీసులు ఉమ్మడిగా దాడులు నిర్వహించారు. మండలంలోని రచ్చకట్టతండా, పాషాపూర్ తండా, తట్టెపల్లి గ్రామాల్లో దాడులు నిర్వహించగా రాథోడ్ శాంతిబాయి అనే మహిళవద్ద రెండు లీటర్ల సారా పట్టుబడింది. అదేవిధంగా 50లీటర్ల బెల్లం పానకం, 10కిలోల నల్లబెల్లం పట్టుబడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మరో నలుగురు వ్యక్తులను అనుమానితులుగా గుర్తించి పెద్దేముల్ తహసీల్దారు ముందు బైండోవర్ చేసినట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

● విద్యార్థులకు తప్పిన ప్రమాదం

తాండూరు రూరల్, ఆగస్టు 1: విద్యుదాఘాతంతో పాడిగేదె మృత్యువాతపడగా విద్యార్థులకు ప్రమాదం తప్పింది. ఈ ఘటన తాండూరు మండలంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అంతారం గ్రామానికి చెందిన పెద్దకుర్వ బీరప్ప కుమారుడు సుందరం, మరో వ్యక్తి వెంకట్‌రెడ్డి ఇద్దరూ కలిసి ఆవులు మేపేందుకు హరిహర టౌన్‌షిప్ సమీపంలోని జ్యోతిబాపూలే పాఠశాల వైపు వెళ్లారు. అదే మార్గంలో జ్యోతిరావు పూలే-హైదరాబాద్ రోడ్డు మార్గంలో అడ్డంగా విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అటుగా వెళుతున్న బీరప్ప గేదె విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే మృత్యువాతపడింది. అయితే ఇదే మార్గంలో పాఠశాల విద్యార్థులు కూడా రాకపోకలు సాగిస్తారు. అయితే విద్యుత్ తీగలు తెగిపడిన సమయంలో వర్షం కురుస్తుండటంతో విద్యార్థులు పాఠశాల వదిలి బయటికి రాలేదు. దీంతో వారికి పెను ప్రమాదం తప్పింది. మరికొందరు విద్యార్థులు బయటికి రాగా, తెగిపడిన విద్యుత్ తీగను చూసి వెనక్కివెళ్లిపోయారు. వెంటనే స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించగా, వారు అక్కడికి చేరుకుని వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మృత్యువాతపడిన గేదె విలువ రూ.60వేలు ఉంటుందని బాధితుడు బీరప్ప తెలిపాడు. ప్రభుత్వ తనకు నష్టపరిహారం అందించాలని వేడుకున్నాడు. విద్యుత్ అధికారులు తెగిన వైర్లను తొలగించి మరమ్మతులు చేపట్టారు.

బాలిక అదృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 1: బాలిక అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంబేద్కర్‌నగర్‌కు చెందిన ముత్ర శ్లోక(17) గతేడాది పదో తరగతి పూర్తి చేసి ఇంట్లోనే ఉంటోంది. బాలిక ఫిట్స్ వ్యాధితో బాధపడుతుండేదని తెలిపారు. గతనెల జూలై 31 సాయంత్రం దుకాణానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి రాత్రి వరకూ తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆచూకీ తెలిస్తే ఘట్‌కేసర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని, బాధితుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యజమానికి తెలియకుండా వైన్స్ డబ్బులు వాడుకున్న వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 1: యజమానికి తెలియకుండా వైన్స్ డబ్బులు వాడుకున్న ఓ వ్యక్తిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అవుషాపూర్‌లోని శ్రీనిధి వైన్స్‌లో పనిచేస్తున్న మహిపాల్‌రెడ్డి గత నెలరోజుల నుంచి మద్యం విక్రయించగా వచ్చిన రూ.15లక్షలు సొంతానికి వాడుకున్నాడని యజమాని బొక్క మల్లారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డబ్బులు ఇవ్వలేదని తల్లిని కొట్టిన కొడుకుపై కేసు


తల్లిని కొడుతున్న కొడుకు

తాండూరు రూరల్, ఆగస్టు 1: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి తన తల్లిని కొట్టాడు. ఈ ఘటన తాండూరు మండలం కరన్‌కోట్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరన్‌కోట్‌లోని లేబర్ కాలనీకి చెందిన బంగారుపల్లి వడ్డె లక్ష్మి, కొడుకు బంగారుపల్లి కృష్ణ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంత కాలంగా కృష్ణ మద్యానికి బానిసయ్యాడు. గురువారం ఉదయం మద్యం తాగడానికి రూ.500 ఇవ్వాలని తల్లి లక్ష్మిని కోరాడు. దీంతో తాగొద్దని చెప్పినా వినకపోవడంతో రూ.100లు ఇచ్చింది. వంద రూపాయలతో మద్యం తాగివచ్చిన కొడుకు మళ్లీ తాగడానికి రూ.200లు కావాలని తల్లిని వేధించాడు. తన వద్ద లేవని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. మద్యం మత్తులో కృష్ణ తల్లిని కొట్టాడు. కొడుకు నుంచి తప్పించుకుని వెళుతున్న ఆమెను కల్లుదుకాణం వద్ద అడ్డగించి కిందపడేసి పిడిగుద్దులు గుద్దుతూ దుర్భాషలాడాడు. దీంతో అక్కడే ఉన్న మహిళలు వచ్చి విడిపించారు. బాధితురాలు లక్ష్మీ వెంటనే కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఈ మేరకు కృష్ణపై ఎస్ఐ విఠల్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

నిషేధిత గడ్డిమందు పట్టివేత

వికారాబాద్, ఆగస్టు 1: నిషేధిత గడ్డిమందును విక్రయిస్తున్నారని పక్కా సమాచారంతో పోలీసులు దాడులుచేసి 135 లీటర్ల నిషేదిత గడ్డిమందును పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశం తెలిపారు. పట్టణంలోని లక్ష్మీ వెంకటేశ్వరా ఫర్టిలైజర్ దుకాణంలో గురువారం దాడులు చేయగా రూ.86వేల విలువ చేసే 135లీటర్ల గడ్డిమందు గ్లైసిన్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. అదే విధంగా గుల్షాన్ బ్రదర్స్ దుకాణంలో రూ.25వేల విలువ గల మందును పట్టుకున్నారు. వీరిపై వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష

వికారాబాద్, ఆగస్టు 1: తల్లిపాలు బిడ్డకు శ్రీరామ రక్ష అని జిల్లా శిశు సంక్షేమ అధికారి ఏ.వెంకటేశ్వరమ్మ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని రాజీవ్ గృహకల్ప నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతీ సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాలిని, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్ మనోహర పాల్గొన్నారు.

శామీర్‌పేట: మండలంలోని లాల్‌గడిమలకోపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్లు తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. పుట్టిన పిల్లల ఎదుగుదలకు, ఆరోగ్యానికి తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమని అంగన్‌వాడీ టీచర్ పుష్ప అన్నారు.

5న తాండూరుకు మంత్రుల రాక

తాండూరు, ఆగస్టు 1 : తాండూరులో ఈ నెల 5న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల పర్యటన ఖరారైంది. వ్యవసాయ ఏఎంసీ ప్రమాణ స్వీకారోత్సవం, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. కార్యక్రమాల్లో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ సైతం పాల్గొననున్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొనాయి.

ఆర్అండ్‌బీ డీఈఈ శ్రీనివాస్ బదిలీ

తాండూరు, ఆగస్టు 1: తాండూరు ఆర్‌అండ్‌బీ డీఈఈ శ్రీనివాస్ బదిలీ అయ్యారు. జిల్లా కార్యాలయంలో రిలీవ్ అయి బుధవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన ఇక్కడ ఎనిమిదేళ్ల పాటు పనిచేశారు. పరిగి డీఈఈ సురేందర్ నాయక్‌కు తాండూరు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

బదిలీపై వెళ్లిన ఆర్ఐకి సన్మానం

మోమిన్‌పేట్: మండల కేంద్రంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ గోవర్ధన్‌ను గురువారం సన్మానించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మనోహరచక్రవర్తి, కార్యాలయ సిబ్బంది గోవర్ధన్‌ను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది జగన్‌యాదవ్, మహేశ్, అలవేలు, మౌనిక, సునిత పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రూపలక్ష్మి


ప్రిన్సిపాల్ మంజులను సన్మానించిన అధ్యాపకులు

దోమ, ఆగస్టు 1: ప్రభుత్వ జూనియర్ కళాశాల దోమ ప్రిన్సిపాల్‌గా రూపలక్ష్మి గురువారం బాధ్యతుల స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన మంజుల బదిలీపై మొగిలిగిద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన మంజులను, నూతనంగా బాధ్యతుల స్వీకరించిన రూపలక్ష్మిని అధ్యాపకులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.